సాక్షి
చిత్తూరు
మంగళవారం ◆ 28 ◆ ఫిబ్రవరి ◆ 2023



చిత్తూరు బులియన్

**బంగారం :**

| | |
|---|---|
| 24 క్యారెట్లు 10 గ్రాములు | రూ.54,000 |
| 22 క్యారెట్లు ఒక గ్రాము | రూ.5,100 |
| **వెండి:** | |
| హోల్‌సేల్ ధర (కిలో) | రూ.67,000 |
| రిటైల్ వెండి గ్రాము | రూ.68.00 |

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| చిత్తూరు | 34 | 19 |
| తిరుపతి | 34 | 19 |
| తిరుమల | 29 | 15 |
| గూడూరు | 33 | 21 |
| నగరి | 34 | 20 |



**సైన్స్ డే**

జాతీయ సైన్స్‌డేని పురస్కరించుకుని బుచ్చినాయుడు కండ్రిగ మండలం, కల్లివెట్టు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు సైన్స్ అక్షరాకృతిలో కూర్చొని ఆకట్టుకున్నారు.
- బుచ్చినాయుడుకండ్రిగ

## న్యూస్‌రీల్

### పోలీస్ కుటుంబాలకు బాసట



చెక్కు అందిస్తున్న ఎస్పీ రిశాంత్‌రెడ్డి

**చిత్తూరు అర్బన్:** విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసుల సేవలకు గుర్తింపుగా వారి కుటుంబాలకు బాసటగా నిలుస్తున్నామని ఎస్పీ రిశాంత్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఈ మేరకు ఆయా పోలీసు కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేశారు. కార్పస్ ఫండ్ నుంచి రమేష్ భార్య లతకు రూ.లక్ష, గ్రూప్ ఇన్సూరెన్స్ ఫండ్ నుంచి రాజమణి సతీమణి దాక్షాయణికి రూ.20,65,000 చెక్కు అందించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ జగదీష్, క్లర్క్ పార్థసారథి నాయుడు, పోలీస్ యూనియన్ నేత ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

### ప్రతి బిడ్డకూ టీకా తప్పనిసరి


**చిత్తూరు రూరల్ :** ప్రతి బిడ్డకూ టీకా తప్పనిసరిగా వేయించాలని డీఐఓ రవిరాజు ఆదేశించారు. సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలోఎంపీహెచ్‌ఈఓలు, సూపర్‌వైజర్లు, ఆశ నోడల్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. చిన్న పిల్లల రొటీన్ టీకాలు క్రమం తప్పకుండా వేయించాలని స్పష్టం చేశారు.

### మొగిలీశ్వరుని హుండీ లెక్కింపు



**బంగారుపాళెం:** మొగిలీశ్వరుని ఆలయంలో సోమవారం హుండీ లెక్కింపు చేపట్టారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయానికి మొత్తం రూ.8,33,852 ఆదాయం వచ్చినట్లు ఈఓ మునిరాజా, ధర్మకర్త విజయకుమార్ తెలిపారు. అందులో హుండీ ద్వారా రూ.5,27,272 సేవా టికెట్ల విక్రయంతో రూ.3,06,580 వచ్చినట్లు వివరించారు.

# ఇదీ పాయే!



ఒకప్పుడు అధికార మదంతో అడ్డదారులు తొక్కుతూ పేట్రేగిపోయిన టీడీపీ నాయకులు ఇప్పుడు డీలాపడిపోయారు. ఎన్నికలు ఏవైనా సరే పోటీ చేయాలంటేనే భయపడిపోతున్నారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న రాష్ట్ర ప్రభుత్వంతో ఢీకొనలేమని చేతులెత్తేస్తున్నారు. ఇదేకోవలో గత నాలుగేళ్లుగా జరిగిన ప్రతి ఎన్నికల్లోనూ ఘోర ఓటమిని మూటగట్టుకున్నారు. తాజాగా ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ నామినేషన్ వేయడానికి వణికిపోయారు. చివరకు నామమాత్రంగా వేసిన ఒక్కగానొక్క నామినేషన్ తిరస్కరణకు గురవ్వడం.. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికకావడంతో మరింత చతికిలపడిపోయారు.

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏకగ్రీవం
- టీడీపీకి నామినేషన్ వేసేవారే కరువు
- వేసిన ఒక్క నామినేషన్ తిరస్కరణ
- వన్నెకుల క్షత్రియ సామాజిక వర్గానికి ఎమ్మెల్సీ ఇవ్వడంపై హర్షం

**సాక్షి, తిరుపతి:** స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వన్నెకుల క్షత్రియ (బీసీ) సామాజికవర్గానికి స్థానిక సంస్థల కోటా కింద ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించడం, ఆపై ఏకగ్రీవంగా ఎన్నికకావడంపై ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. టీడీపీ అభ్యర్థి ధనుంజయులు వేసిన నామినేషన్ తిరస్కరణకు గురైంది. నామినేషన్‌కు అవసరమైన పత్రాలు సమర్పించకపోవడంతో టీడీపీ అభ్యర్థి నామినేషన్ తిరస్కరించినట్లు రిటర్నింగ్ అధికారి వెంకటేశ్వర్లు ప్రకటించారు. ఉమ్మడి చిత్తూరు చంద్రబాబు సొంత జిల్లానే అయినా వైఎస్సార్‌సీపీ కంచుకోట. ఎన్నిక ఏదైనా వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకే జనం పట్టం కట్టారు. 14 అసెంబ్లీ స్థానాలకుగాను 13 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు విజయం సాధించారు. మూడు పార్లమెంట్ స్థానాలను వైఎస్సార్‌సీపీ స్వీప్ చేసింది.

**ఫంకా..విజయ ఢంకా**

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఈ నాలుగేళ్ల కాలంలో సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, కార్పొరేషన్, మున్సిపాలిటీ ఎన్నికల్లోనూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులే అధికశాతం విజయం సాధించారు. టీడీపీ, జనసేన కుమ్మక్కై కుట్రలు చేసినా జనం వారి మాటలు, రాతలను తిరస్కరించారు. చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పం మున్సిపాలిటీకి జరిగిన తొలి ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు 19 మంది విజయం సాధిస్తే, టీడీపీ తరుపున ఆరుగురు మాత్రమే గెలుపొందారు. అదేవిధంగా జెడ్పీటీసీ సభ్యులు నలుగురుంటే అన్నింటినీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులే సొంతం చేసుకున్నారు. 68 ఎంపీటీసీ స్థానాలకుగాను 64, 89 సర్పంచ్ స్థానాల్లో 74 చోట్ల వైఎస్సార్‌సీపీ అభ్యర్థులే విజయం సాధించారు. టీడీపీ హయాంలో చక్రం తిప్పిన మంత్రులు, ఎమ్మెల్యేల నియోజక వర్గాల పరిధిలోనూ వైఎస్సార్‌సీపీ జోరును అడ్డుకోలేకపోయారు.

### వైఎస్సార్‌సీపీలో బీసీలకు పెద్దపీట

టీడీపీ బీసీలను ఓటు బ్యాంక్‌గా మాత్రమే వాడుకుంది. వారికి ఉన్నత పదవులు ఇచ్చిన దాఖలాలు లేవు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలను బ్యాక్ బోన్‌గా పరిగణించారు. అందుకే వారికి ఉన్నత పదవులు ఇచ్చి గౌరవిస్తున్నారు. అందులో భాగంగా వన్నెకుల క్షత్రియ సామాజికవర్గానికి చెందిన డాక్టర్ సిపాయి సుబ్రమణ్యంకి స్థానిక సంస్థల కోటా కింద ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలోకి దించారు. దీంతో ఆ సామాజికవర్గం నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### ఉమ్మడి జిల్లా సమాచారం

| | | | | | |
|---|---|---|---|---|---|
| అసెంబ్లీ స్థానాలు | : | 14 | జెడ్పీటీసీలు మొత్తం | : | 65 |
| వైఎస్సార్‌సీపీ | : | 13 | వైఎస్సార్‌సీపీ | : | 65 |
| టీడీపీ | : | 01 | టీడీపీ | : | 0 |
| ఎంపీటీసీలు మొత్తం | : | 877 | కార్పొరేటర్లు మొత్తం | : | 100 |
| వైఎస్సార్‌సీపీ | : | 825 | వైఎస్సార్‌సీపీ | : | 94 |
| టీడీపీ | : | 40 | టీడీపీ | : | 05 |
| స్వతంత్రులు | : | 11 | పెండింగ్ | : | 01 |
| సీపీఐ | : | 01 | | | |

# సుపరిపాలనతోనే సత్ఫలితాలు



మాట్లాడుతున్న మంత్రి రోజా, పక్కన ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి

**పుత్తూరు రూరల్:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సుపరిపాలనతోనే ప్రతి ఎన్నికల్లో సత్ఫలితాలు సాధిస్తున్నట్లు మంత్రి ఆర్‌కే రోజా స్పష్టం చేశారు. సోమవారం పరమేశ్వరమంగళం లోని ఓ ప్రైవేట్ కల్యాణమండపంలో ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. మంత్రి రోజా మాట్లాడుతూ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరచిన అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పట్టభద్రుల ఎన్నికల్లో పార్టీ గుర్తు ఉండదని, బ్యాలెట్ పేపర్‌లో మన అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి పేరుకు ఎదురుగా ఉన్న బాక్స్‌లో పోలింగ్ అధికారి ఇచ్చిన పెన్‌తో 1 అంకె మాత్రం వేయాలని సూచించారు. అనంతరం పేపర్‌ను యథావిధిగా మడచి బ్యాలెట్ బాక్స్‌లో వేయాలని వివరించారు. దీనిపై ప్రతి గ్రాడ్యుయేట్‌ను కలిసి తెలియజేయాలని కోరారు. నగరి నియోజకవర్గంలో మొత్తం 7,749 పట్టభద్ర ఓటర్లు ఉన్నారని, వారందరినీ నేరుగా కలిసి ఓటు అభ్యర్థించాలని తెలిపారు. ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ, అన్ని సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. అవకాశం కల్పించాలని కోరారు. సమావేశంలో పుత్తూరు, నగరి మున్సిపల్ ఛైర్మన్లు హరి, నీలమేఘం, వైస్ ఛైర్మన్లు శంకర్, జయప్రకాష్, వెంకటరత్నం, బాలన్, రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రారెడ్డి, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మాహీన్ పాల్గొన్నారు.

# గెలుపే లక్ష్యంగా సమష్టి కృషి



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

**కార్వేటినగరం :** రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా సమష్టిగా కృషి చేయాలని డిప్యూటీ సీఎం నారాయణస్వామి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక కల్యాణమండపంలో గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్‌సీపీకి పటిష్టమైన వ్యవస్థ, ప్రజాదరణ ఉందన్నారు. కష్టపడి పని చేసే వారికి పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందని తెలిపారు. పారదర్శకంగా అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లాలని సూచించారు. గృహసారథులు తమ పరిధిలోని ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని కోరారు. బీసీలకు అధిక ప్రాధాన్యం ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు కృషి చేయాలని సూచించారు. అనంతరం మా నమ్మకం నువ్వే జగనన్న స్టిక్కర్ ఆవిష్కరించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, రాష్ట్ర యువత ప్రధాన కార్యదర్శి ధనంజయరెడ్డి, ముస్లిం మైనారిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హమీద్ బాషా, వైస్ ఎంపీపీలు కార్తీక్‌రెడ్డి, మణెమ్మ, కో–ఆప్షన్ సభ్యుడు పట్నం ప్రభాకర్‌రెడ్డి, ఏఎంసీ వైస్ ఛైర్మన్ గోపి, సింగిల్ విండో అధ్యక్షుడు లోకనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### చెక్‌బౌన్స్ కేసులో నిందితుడికి జైలు

తిరుపతి లీగల్ : చెక్‌బౌన్స్ కేసులో తిరుపతికి చెందిన మధు వ్యక్తికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ సోమవారం తీర్పు చెప్పారు. అతను 2010లో తిరుపతి ఖాదీకాలనీకి చెందిన సాకమూరి రంగయ్య చౌదరి వద్ద రూ.5.25 లక్షలు అప్పుగా తీసుకుని చెక్కు ఇచ్చాడు. ఆ చెక్కు బౌన్స్ కావడంతో కోర్టులో చెక్‌బౌన్స్ కేసు వేశాడు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

### పోలీసుల అదుపులో మంత్రగాడు


క్షుద్ర పూజలు చేస్తున్న దృశ్యం

పెద్దపంజాణి: మండలంలోని వీరప్పల్లె పంచాయతీ ఎర్రదిమ్మనపల్లెలో సోమవారం క్షుద్ర పూజలు చేస్తున్న మంత్రగాడిని స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. దీనిపై పోలీసులు విచారణ చేపట్టారు.

# క్షణాల్లో బుగ్గి

- ఫాక్స్‌లింక్ కంపెనీలో భారీ అగ్ని ప్రమాదం
- షార్ట్ సర్క్యూటే కారణమా?

రేణిగుంట: రేణిగుంట ఎయిర్‌పోర్ట్ సమీపంలో ఉన్న ఫాక్స్‌లింక్ ఇండియా ఎలక్ట్రికల్ కంపెనీలో సోమవారం మధ్యాహ్నం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. చార్జింగ్ వైర్ల విడి భాగాలను అనుసంధానం చేసే అసెంబ్లింగ్ యూనిట్, దానికి ఎదురుగా ఉన్న మరో యూనిట్ క్షణాల్లో కాలిబూడిదయ్యాయి. ప్రాణభయంతో కార్మికులు పరుగులు తీయగా.. అగ్నిమాపక సిబ్బంది, ఇతర అధికారులు హుటాహుటిన చేరుకుని మంటలను అదుపు చేశారు. ఎవ్వరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

**షార్ట్‌సర్క్యూటే కారణం**

మొత్తం ఏడు మీటర్ల ఎత్తులో రూఫ్ ఉన్న ఈ భవనంలో కింద భాగం నాలుగు మీటర్లు, పై భాగంలో ఉన్న మూడు మీటర్లలో ఫాల్‌సీలింగ్‌ను ఏర్పాటు చేశారు. దాని పైభాగంలో రూఫ్, ఉష్ణోగ్రతను నియంత్రించేందుకు ఏర్పాటు చేసిన గ్లాస్ ఊల్, దానికింద ఇనుప వలతో ఫ్యాక్టరీలో రూఫ్ పైభాగాన్ని నిర్మించారు. అయితే విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో కింద ఏమీ తెలియకుండా పైభాగంలో మంటలు ఒక్కసారిగా చెలరేగాయి. ఫ్యాక్టరీ నిండా ప్లాస్టిక్, మండే గుణం ఉన్న వైర్లు ఉండడంతో మంటలు ఒక్కసారిగా వ్యాపించాయి. అయితే కంపెనీ యాజమాన్యం సేఫ్టీ చర్యలు చేపట్టడంలో అనుమానాలున్నాయని అధికారులు ఆరా తీస్తున్నారు. ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.


అగ్ని ప్రమాదంలో కాలిపోయిన ఫాక్స్‌లింక్ కంపెనీ భవనం


భయంతో బయటకు పరుగులు తీస్తున్న ఉద్యోగులు

**ఎమ్మెల్యే పరిశీలన**

ప్రమాద విషయం తెలుసుకున్న శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి హుటాహుటిన ప్రమాద స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు చేపట్టి నష్టనివారణకు కృషి చేయాలని ఆయన సూచించారు. అలాగే తిరుపతి ఈఎంసీ సీఈఓ గౌతమి చేరుకుని పరిశీలించి జిల్లా కలెక్టర్‌కు వివరాలను తెలియజేశారు. డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ రామకృష్ణారెడ్డి, కాలుష్య నియంత్రణ మండలి అధికారి నరేంద్రబాబు తదితరులు ప్రమాదం జరిగిన ఫ్యాక్టరీలో పరిశీలించి ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు.


పరిశ్రమ ప్రాంగణంలో దట్టమైన పొగలు


ప్రమాద వివరాలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి


పరిశీలిస్తున్న ఈఎంసీ సీఈఓ గౌతమి



## ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం


బ్యాలెట్ బాక్సులను పరిశీలిస్తున్న తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ అనుపమ అంజలి

తిరుపతి తుడా: ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధం చేసినట్టు నగరపాలక సంస్థ కమిషనర్ అనుపమ అంజలి తెలిపారు. ఆమె సోమవారం తిరుపతి అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామగ్రి, పద్మావతి డిగ్రీ కళాశాలలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. మార్చి 13న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలకు తిరుపతి నియోజకవర్గంలో గ్రాడ్యుయేట్ ఓటర్లకు 25, టీచర్లకు 4 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎన్నికల సామగ్రి పంపిణీ, బ్యాలెట్ బాక్సులు భద్రపరిచే గదుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. తహసీల్దార్ వెంకటరమణ, డీటీ జీవన్ తదితరులు పాల్గొన్నారు.

## బాకీ అడిగినందుకు మూకుమ్మడి దాడి

నాయుడుపేటటౌన్: బాకీ అడిగినందుకు ముగ్గురు యువకులతో కలిసి మూకుమ్మడిగా దాడి చేసినట్లు బాధితుడు బొమిడి శ్రీనివాసులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పట్టణానికి చెందిన శ్రీనివాసులు పుదూరు గ్రామానికి చెందిన చైతన్య అనే యువకుడికి నగదు అప్పుగా ఇచ్చాడు. ఎంతకీ తిరిగి ఇవ్వకపోవడంతో అతనిని నిలదీశాడు. ఈ క్రమంలో సోమవారం పట్టణంలోని రజక కాలనీ వద్ద చైతన్య మరో ఇద్దరు యువకులు మునిరాజా, సంపత్‌తో వచ్చి రాళ్లతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచినట్లు బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి గాయపడిన శ్రీనివాసులును ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

## మద్యంలో నీళ్లు కలిపి విక్రయం

– ముగ్గురి అరెస్ట్

వడమాలపేట: మద్యంలో నీళ్లు కలిపి విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను ఎక్సైజ్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. వివరాలు.. స్థానిక రామసముద్రం రోడ్డు పక్కన ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణం సమీపంలో తిరుపతికి చెందిన ధనశేఖర్ కూల్‌డ్రింక్ షాపు నడుపుతున్నాడు. వైన్‌షాప్‌లో మద్యం తీసుకొచ్చి అందులో నీళ్లు కలిపి అమ్ముతున్నట్టు సమాచారం అందడంతో ఎక్సైజ్ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న ముని, రవీంద్రరాజు, ధనశేఖర్‌ను అరెస్టు చేసి పుత్తూరు ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు.

## నెమలి అప్పగింత


నెమలితో నవీన్

వడమాలపేట: మండలకేంద్రంలోని ఓ రెస్టారెంట్ వద్ద సోమవారం వాలిన నెమలి పిల్లని అక్కడి సిబ్బంది నవీన్, శ్రీధర్ పట్టుకుని అటవీశాఖ అధికారులు చంద్రబాబు, కుమారస్వామికి అప్పగించారు. అనంతరం నెమలిని అంజేరమ్మ కనుమ వద్ద అటవీప్రాంతంలో విడిచిపెట్టినట్లు ఫారెస్ట్ సిబ్బంది తెలిపారు.

## వైఎస్సార్‌సీపీ పటిష్టతకు కృషి చేయండి


సురేష్‌రెడ్డి, అనీల్‌రెడ్డి, శివకుమార్‌ని సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి: జిల్లా స్థాయిలో వైఎస్సార్‌సీపీ పార్టీ పదవులు పొందిన నేతలు క్షేత్రస్థాయి నుంచి పార్టీ పటిష్టతకు మరింత కృషి చేయాలని తిరుపతి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి సూచించారు. ఆయన నివాసంలో తిరుపతి జిల్లా ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, నెల్లూరు జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు, కలువాయి జెడ్పీటీసీ సభ్యుడు బీ అనీల్‌కుమార్‌రెడ్డి, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు కాసుల శివకుమార్‌ని ఆయన ఘనంగా సత్కరించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారిని గుర్తించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారికి సముచిత స్థానం కల్పించడం హర్షణీయమన్నారు. వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ జి ఢిల్లీబాబు, సీనియర్ నేతలు చెలికం శంకరరెడ్డి, పి దశరథరామిరెడ్డి, టి శివారెడ్డి, సీహెచ్ శ్రీనివాసులురెడ్డి, పి ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గణనాథుని సేవలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి

కాణిపాకం (యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రియదర్శిని సోమవారం దర్శించుకున్నారు. ఉదయం ఆమె కుటుంబ సమేతంగా స్వామివారి దర్శనార్థం కాణిపాకం విచ్చేయగా ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం కల్పించారు. ఆశీర్వాద మండపంలో వేదపండితులు ఆశీర్వదించి, స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.


జస్టిస్ ప్రియదర్శినికి స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి

## స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు

తిరుపతి అర్బన్: స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించడానికి అధికారులు సమష్టిగా కృషి చేయాలని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి, డీఆర్వో ఎం.శ్రీనివాసరావుతో కలిసి ఎన్నికల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అనుబంధ పోలింగ్ కేంద్రలతోపాటు 101 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఎన్నికల కమిషన్ ఈనెల 23వ తేదీన విడుదల చేసిన ఓటర్ల జాబితా ప్రకారం పట్టభద్రులకు సంబంధించి 86,941 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించి 37 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో మొత్తం 6,132 మంది ఓటర్లు ఉన్నట్టు వెల్లడించారు. 7 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పర్యావేక్షణ చేపడతాయన్నారు. జిల్లాలోని నాలుగు రెవెన్యూ డివిజన్లలో 23 సెక్టార్లు ఏర్పాటు చేసి రూట్ ఆఫీసర్లు, 15 మంది నోడల్ అధికారులను నియమించినట్టు తెలిపారు. ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ 23 రూట్లకు గాను 31 మొబైల్ టీంలు ఏర్పాటు చేశామన్నారు.


మాట్లాడుతున్న తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి



## రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి


రక్తగాయాలతో రోడ్డుపై పడి ఉన్న యువకులు


భాస్కర్ (ఫైల్)

నగరి: పుత్తూరు మార్గంలో కైలాసపురం వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భాస్కర్ (20) అనే విద్యార్థి మృతిచెందగా, కార్తీక్ (20) అనే మరో విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. నగరిలోని చింతలపట్టెడకు చెందిన భాస్కర్ పుత్తూరులోని వేర్వేరు కళాశాలల్లో డిగ్రీ, కార్తీక్ ఎంబీఏ చదువుతున్నారు. వీరు బైక్‌పై కళాశాలకు వెళుతుండగా కుక్కలు అడ్డుపడటంతో అదుపుతప్పి రోడ్డుపై పడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో నగరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే భాస్కర్ మృతిచెందాడు. కార్తీక్‌ను మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తీసుకెళ్లారు.

## యువతి అదృశ్యంపై కేసు


సుప్రజ (ఫైల్)


చౌడేపల్లె: మండలంలోని దిగువపల్లెకు చెందిన ఓ యువతి అదృశ్యంపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు. వివరాలు.. భవానీ నగర్‌కు చెందిన వెంకటరమణ కుమార్తె సుప్రజ (19) పీలేరులోని ఓ ప్రైవేట్ కళాశాలలో బీటెక్ ఫస్టియర్ చదువుతోంది. ఈనెల 25వ తేదీన కళాశాలకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబీకులు వెతికినా ఆచూకీ దొరకలేదు. ఈ మేరకు యువతి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9440900698 నంబర్‌కు సమాచారమివ్వాలని కోరారు.

## చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి..


సుబ్రమణ్యం మృతదేహం

వడమాలపేట: మండలంలోని ఓబీఆర్ కండ్రిగ ఎస్టీకాలనీ వద్ద వెదళ్లచెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి సుబ్రమణ్యం(35) అనే వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. సుబ్రమణ్యం శనివారం సాయంత్రం చేపలు పట్టేందుకు చెరువులో వల వేసి వచ్చాడు. ఆదివారం ఉదయం చేపల తీసుకువస్తానని భార్యకు చెప్పి వెళ్లాడు. సాయంత్రమైనా తిరిగి ఇంటికి రాకపోవడంతో భార్య వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటికే రాత్రి కావడంతో సోమవారం ఉదయం పోలీసులు అగ్నిమాపక సిబ్బంది సాయంతో చెరువులో గాలింపు చర్యలు చేపట్టి సుబ్రమణ్యం మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడికి ఇద్దరు పిల్లలు. పోషించే వ్యక్తి మరణించడంతో కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

## విద్యుదాఘాతంతో రైతు మృతి


పాపిరెడ్డి మృతదేహం

పెద్దపంజాణి: మండలంలోని పెద్దారికుంట పంచాయతీ పిల్లిగుండ్లపల్లెలో సోమవారం ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై ఓ రైతు మృతి చెందాడు. వివరాలు.. పుంగనూరు మండలం బండ్లపల్లె పంచాయతీ ధర్మవరంపల్లెకు చెందిన పాపిరెడ్డి(57)కి పిల్లిగుండ్లపల్లెలో వ్యవసాయ పొలం ఉంది. ఈ క్రమంలో ఉదయం మోటర్ వేసేందుకు పొలానికి వెళ్లగా కరెంట్ షాక్‌కు గురై అక్కడిక్కడే మృతి చెందాడు. పోలీసులు మృత దేహాన్ని పోస్టుమార్టం పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## చెట్టుకొమ్మ పడి ఒకరికి గాయాలు

కుప్పంరూరల్: మండలంలోని గుట్టపల్లెకాలనీ వద్ద బైక్‌పై వస్తున్న ఓ వ్యక్తిపై సోమవారం చింతచెట్టు కొమ్మ విరిగి పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. దాసేగౌనూరుకు చెందిన రాజమాణిక్యం వ్యక్తిగత పని నిమిత్తం ద్విచక్రవాహనంలో కుప్పానికి బయలుదేరాడు. మార్గం మధ్యలో ఈ ప్రమాదం జరిగింది. స్థానికులు వెంటనే రాజమాణిక్యాన్ని ఆస్పత్రికి తరలించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

## కన్నుమూసిన శతాధిక వృద్ధురాలు


లక్ష్మమ్మ(ఫైల్)

వెదురుకుప్పం: మండలంలోని తంగేళిమిట్ట గ్రామానికి చెందిన బండి లక్ష్మమ్మ(104) అనే వృద్ధురాలు సోమవారం వేకువజామున కన్నుమూశారు. చివరి వరకు ఆమె ఆరోగ్యంగానే జీవించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. వృద్ధురాలికి కుమారులతోపాటు మనుమలు, మునిమనవరాళ్లతోపాటు మొత్తం 20 మంది ఉన్నామని వారు వివరించారు.